# బుద్ధి

"చలి చలిగా వుందిరా, హోయ్ రామా... లల్లా లల్లల..."

మొదటి చెంబుడు చల్లటి నీళ్ళువంటి మీద పడగానే చలికి నరాలు జివ్వుమన్నాయి.

వణుకుతూ కూనిరాగం తీస్తోంది లక్ష్మి నీళ్ళు పోసుకుంటూనే.

"ఏయ్ లక్ష్మీ! ఏమిటా పాటలు! నిశ్శబ్దంగా నీళ్ళు పోసుకోలేవూ? అవతల వాడికి వినబడాలనా నీ గోల..."

కస్సుమన్నాడు సీతాపతి.

"ఛ! ఛ! అవేం మాటలండీ! ఎవరైనా వింటే ఏమనుకుంటారు! హవ్వ!"

"ఏమనుకోవడాని కేముంది? గువ్వలా పాటలు పాడుతూ చెంబు శబ్దాలు చేస్తూ గంటసేపు పోసుకుంటూ ఉండు. వాడు గోడెక్కి చూస్తాడు మళ్ళీ. అస్సలు... అలా చూడాలనే... అంతసేపు..."

సీతాపతి ఆఖరి మాట పూర్తవకుండానే లక్ష్మికి సర్రున కోపం వచ్చింది.

"ఛీ! నోటికెంత తోస్తే అంత అనేడమేనా?... ఏమిటి మీరనేది? తెలివుండే అంటున్నారా? లేక నిద్రమత్తు ఇంకా వదల్లేదా? పోనీ బాత్‌రూం లాంటిది కట్టించమని ఇంటి వారికి చెప్పండీ అంటే చెప్పరు. వాడు అద్దె ఎక్కువ అడుగుతాడని భయం. సంపాదన... సంపాదన... అని గొప్పలు చెప్పడమే కాని ఫస్టు అయ్యేసరికి పప్పులూ, ఉప్పులూ, కూరా, నారా అన్నీ తెచ్చుకున్నాక ఇంటి అద్దె ఇచ్చుకోడానికి కటకట లాడిపోతున్నాం. పోనీ వేన్నీళ్ళు పెట్టి పోసుకుందామంటే, కర్రల పొయ్యి పెట్టుకుందికి జాగాలేదు కొంపలో. గ్యాసు మీద పెడ్తే, సిలిండరు పట్టుమని నెలకూడా రాదేమోనని భయం! ఎలాగ చచ్చేది?" కయ్యిమంది లక్ష్మి.

"సర్లే సర్లే, నీ దండకం విని గోడదూకి ఇటు వచ్చేసేగల్డు వాడు! వేగం పోసుకుని వద్దూ, అక్కడ్నుంచి జవాబులు చెప్పక. చదువు వచ్చిన ఆడదాంతో వంట వచ్చిన మగవాడితో వేగలేనని నాయనమ్మ అంటుండేది. అది నిజమే. ఏవైనా అనేసరికి టకీమని జవాబులు ఇచ్చేస్తావు నోర్మూసుకుని పడి ఉండక."

"మీరిలాంటి అర్థం పర్థంలేని మాటలు ఎన్ని అన్నా మాట్లాడకుండా నోరుమూసు కుని ఉంటే మంచిదాన్ని కదూ. 'ఇది కాదు. అది' అంటే చెడ్డ! ఛీ! ఛీ! మీతో వేగడం మహాకష్టం!"

"చీటికీ మాటికీ మొండికేసే నీతో వేగడమూ నాకు మహాకష్టమే!"

"అంత కష్టమయితే ఎందుకు నన్ను పెళ్ళి చేసుకున్నారు?"

"మీవాళ్ళొచ్చి మావాళ్ళని కాళ్ళావేళ్ళా పడి బతిమాలితే చేసుకున్నాను. లేకపోతేనా..."

"లేకపోతే హాయిగా ఏ చదువురాని చింతపండు ముద్దలాంటి దాన్నో చేసుకుని ఉందురు కాబోలు ఎంచక్కా!"

"ఓ. నువ్వు మహా బాగున్నావనే కదా ఆ గర్వం!"

"పోనీ మీరు బాగున్నారు కదా - నవ మన్మధుడిలాగ!"

"మాటకి మాట అంటించడం ఒకటి బాగా తెలుసు నీకు."

రుసరుసలాడిపోయేడు సీతాపతి.

★ ★ ★

ఇది రోజూ ఉన్న భాగోతమే. పాతికడుగుల వెడల్పూ, అరవై అడుగుల పొడవూ ఉన్న ఆ ఇంటిని జరాసంధుని నిలువునా చీల్చినట్టు, సరిగ్గా ఇంటి మధ్యకు పొడవునా గోడ కట్టేసి నూటేభై రావల్సిన చోట రెండొందలు రాబడుతున్నాడు ఇంటివాడు. ఇంట్లో కుళాయి లేదు. కామన్ నుయ్యి. బాత్‌రూమ్ లేదు. పెరట్లో ఆడవాళ్ళు నీళ్ళు పోసుకుంటే పిట్టగోడ దగ్గర నించుంటే చాలు - ఆ దృశ్యం కనబడుతుంది.

"ఈ దరిద్రుడొకడు దొరికేడు తనపాలిటి యముడిలా!" వంకాయలు అందంగా, ఆర్టిస్టిక్‌గా తరుగుతున్న సీతాపతి, పక్కవాటా వాడ్ని తలుచుకుని విసుక్కున్నాడు.

"ఇన్నాళ్ళూ పక్కవాటాలో అతని పెళ్ళాం, పిల్లలూ ఉండేవారు. ఏదో తనకీ వూసుపోయేది. ఉన్నట్టుండి పెళ్ళాం, పిల్లల్ని, దగ్గర్లో ఉన్న సొంతవూరు పంపించేసేడు. వారం వారం వెళ్ళి వస్తున్నాడు. పెళ్ళాం లేకపోయేసరికి అవేం పాడుబుద్ధులు ఆయనకి! మొన్నటికి మొన్న గోడ దగ్గర మొహం ఎత్తిమరీ చూస్తున్నాడు. ఛీ! పాడు! ఎవరితో చెప్పుకుంటాం ఇలాంటివి! అసలే ఈయన అనుమానం మనిషి! ఇహ తను రోజూ స్నానం చేసేటప్పుడు ఇతనక్కడ కాపలా కాయడం, తనని ఏదో ఒకటి అనడం మామూలైపోయింది! ఏమిటి ఈ బాధ!' మనసులోనే సణుక్కుంది లక్ష్మి వంటవండుతూ.

సీతాపతికి మహాకోపంగా ఉంది. కసిగా ఉంది. మంటగా ఉంది! తను అగ్నిసాక్షిగా తాళికట్టిన పెళ్ళాం లక్ష్మి! తన పెళ్ళాం అందాలన్నీ తన సొత్తు.

ప్రతీ అణువునూ ఒక్క తన కళ్ళే చూడాలి! ఆనందించాలి! అనుభవించాలి! వాడెవడు మధ్యన తన పెళ్ళాన్ని చూడ్డానికి!

వాడికెన్ని గుండెలు!

వాడి అంతు తేల్చేయాలి. వాడిపని పట్టాలి!

"మరెప్పుడూ చూడను బాబోయ్" అన్నట్టు చేసెయ్యాలి.

పరాయి మగాడు తన పెళ్ళాన్ని చూడ్డమా! అందులోనూ స్నానం చేస్తున్నప్పుడు!

"ఏవోయ్ జగన్నాథం! అస్సలు నీకు బుద్ధుందా, లేదా?" అని అడగాలి!

కాని... కాని... తను అడగలేదు. అడగలేడు!!

మనసు కుతకుత ఉడికిపోయింది. సీతాపతికి.

మింగలేక, కక్కలేక అవస్థపడిపోతున్నాడు.

★ ★ ★

మళ్ళీ మరొకనాడు : లక్ష్మి స్నానం చేస్తుంటే-

రివ్వున వచ్చి వీపుకి తగిలి కిందపడింది చిన్న కాగితం ఉండ. చివ్వున తలెత్తి చూసేసరికి అతను వెళ్ళిపోతూ కనిపించేడు. సిగ్గుతో చచ్చిపోయినట్టయింది.

సబ్బు రుద్దుకోకుండానే స్నానం అయిందనిపించేసి లోపలికి వచ్చి భర్తమీద విరుచుకు పడింది.

"అస్సలు మీకు బుద్ధుందా, లేదా? పక్క ఆయన అల్లరిరోజు రోజుకీ మితిమీరి పోతుంటే మీరు నిమ్మకు నీరెత్తినట్టు వూరుకుంటారా? చేతకాని వాళ్ళకే శౌర్యంలావట! ఇక్కడే మీ ప్రగల్భాలన్నీ! అతన్ని సూటిగా వెళ్ళి అడగకూడదూ... 'నీకు అక్కల్లేరా? చెల్లెళ్ళు లేరా? పెళ్ళాం లేదా? ఆడదాని ముఖం ఎప్పుడూ చూడలేదా? ఎందుకు, నాయనా, ఇలాగ చంపుకుతింటున్నావు' అని. మిమ్మల్నే. మాట్లాడరేమండీ? ఇవాళ అటో, ఇటో తేల్చేండి. వింటున్నారా? వెళ్ళి నాలుగు దులిపేసిరండి!"

తన భుజం కుదిపేస్తూ మాట్లాడుతున్న పెళ్ళాంవైపు తెల్లమొహం వేసుకుని చూస్తూ ఉండిపోయేడు సీతాపతి.

"అలాగే... అలాగే... ఇవాళ వాడి సంగతి తేలుస్తాను" అన్నాడు నీరసంగా.

"అదేమిటి - నూతిలోంచి వచ్చినట్టున్నాయి ఆ మాటలు! నన్ను వాడు అంతలా అవమానిస్తుంటే మీకేమీ అనిపించడం లేదా? లేక అక్కడికి వెళ్ళి అడిగే ధైర్యం లేక అలా నీరుగారిపోతున్నారా? ఏమిటండీ?..." నిలదీసి అడిగేస్తోంది లక్ష్మి.

"అబ్బ! అలాగే అడుగుతాను లేవే. నువ్వెళ్ళి నీ వంటపని చూసుకో." పైకి విసుకున్నాడు.

పెళ్ళాం వెళ్ళిపోగానే తల పట్టుక్కూర్చున్నాడు, ఏం చెయ్యాలో తోచక.

'చద్దితిన్న బ్రాహ్మడా! అనుభవించు' అన్నట్టుంది సీతాపతి పని.

'ఏమని అడుగుతారు అస్సలు? తను వేసిన ప్రశ్నే అతను తిరిగి తనకి వేస్తే? లక్ష్మి పురిటికి పుట్టింటి కెళ్ళినప్పుడు, ఆ జగన్నాథం పెళ్ళాన్ని రోజూ స్నానం చేస్తున్న ప్పుడు తను కళ్ళతోనే తాగేస్తున్నట్టు చూడలేదూ? రెండు మూడుసార్లు ఆవిడ తలెత్తి తన్నిచూసి, పాపం మొహం దించుకుని, గబగబా బట్టలు వంటికి చుట్టుకుని లోపలికి పరుగెత్తేదే! ఆ సంగతి ఆవిడ జగన్నాథానికి చెప్పే ఉంటుంది. తను ఈ విషయం ఎత్తితే అతనా సంగతి ఎత్తుతాడు ఖచ్చితంగా.

అందుకే తేలుకుట్టిన దొంగలా వూరుకున్నాడు.

లక్ష్మి అడిగితే- "నాలుగిచ్చేనులే! మరెప్పుడూ నీ జోలికి రాడు" అని దర్జాగా గొంతు పెంచి మరీ అబద్ధం ఆడేడు.

వీళ్ళిద్దరి గొంతుకలూ చిన్నవి కావు. వీళ్ళు మాట్లాడుకుంటున్నవన్నీ జగన్నాథం చెవులకి వినబడుతూనే ఉన్నాయి.

(నిజానికి జగన్నాథం. అల్లరి వేషాలు వేసే రకంకాదు. కాని, సీతాపతికి తెల్సిరావాలనే ఆ కాగితం 'వుండ' పడేశాడు.)

మొహం తప్పుకుంటే మోహం కూడా తప్పుకుంటుందని సామెత. తొంగి చూడ్డమే ఆగిపోతే వొంగి వాలడంకూడా ఆగిపోదా!

★ ★ ★

*(ఆంధ్రప్రభ, వీక్లీ : 17-6-1981)*